

మారుతోన్న రాజకీయ సమీకరణలు..!

◆టిడిపి వైపు ఎన్ఆర్ఐలు, వైసిపి నేతలు
◆పాతకాపులకు వైసిపి గాలం
◆నేతలకు బుజ్జగింపులు

2024 ఎన్నికలకు అప్పుడే రాజకీయ ఎత్తుగడలు సాగుతున్నాయి..టిడిపికి అనుకూల పరిస్థితులున్నాయనే ప్రచారంతో ఎన్ఆర్ఐలు, వైసిపి నేతలు అధినేత వద్దకు తిరుగుతున్నారని తెలుస్తోంది. వైసిపిని వీడిన పాత కాపులను మళ్లీ పార్టీలోకి తీసుకోడానికి వైసిపి ప్రయత్నాలు చేస్తుంది. ప్రధానంగా వైసిపి నుంచి వెంకటగిరి ఎంఎల్ఎ ఆనం రామనారాయణరెడ్డి, నెల్లూరు రూరల్ ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వైసిపి నేతలు మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి సమీప బంధువులు, చేజర్ల సుబ్బారెడ్డి, కావ్య కృష్ణారెడ్డి లతో పాటు ఉదయగిరి, కావలి, ప్రాంతాలకు ఎన్ఆర్ఐలు టికెట్లు ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. చంద్రబాబు నాయుడు ఇప్పటికే పార్టీలోకి వచ్చేవారికి ఆహ్వానం పలికారు. వైసిపి అధినేత జగన్ పార్టీపై అసంతృప్తితో ఉన్న నేతలను బుజ్జగించే పనిలో ఉన్నారు. నెల్లూరు రూరల్ ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, బుజ్జగించినట్లు తెలిసింది. ఆయన సోదరులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి రాష్ట్ర స్థాయి పదవి ఇచ్చారు. ఆనం కుటుంబానికి మాత్రం బయటకు పంపేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది.

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

2024 ఎన్నికలకు ఇప్పటి నుంచే రాజకీయ ఎత్తుగడలు సాగుతున్నాయి. రానున్న ఎన్నికలు వైసిపి, టిడిపికి ఎంతో కీలకమైనవి. టిడిపికి ఈ విజయం ఎంతో అవసరం. వైసిపి తాను చేసిన సంక్షేమ పథకాలకు తీర్పుగా దీనిని భావిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో టిడిపికి అనుకూలమైన పరిస్థితులున్నాయి. ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉందని ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో వైసిపి నుంచి కొందరు నేతలు టిడిపి నేతలతో టచ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. వెంకటగిరి ఎంఎల్ఎ, సీనియర్ రాజకీయ నేత ఆనం రామనారాయణరెడ్డి పార్టీ వీడడం దాదాపు ఖరారైనట్లు తెలుస్తోంది. ఇప్పటికే ప్రభుత్వం, పార్టీపై విమర్శలు గుప్పించారు. దీంతో వెంకటగిరి పార్టీ ఇన్‌ఛార్జిగా నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని నియమించారు. ఆనంను పక్కనపెట్టడానికి వైసిపి అధిష్టానం సిద్ధమైనట్లు విశ్వసనీయ సమాచారం. ఇదే సమయంలో ఆనం కూడా టిడిపిలోకి వెళ్లాలని నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. నేడో, రేపో వైసిపి ఆయనకు షోకాజ్ నోటీసు జారీ చేయడం, పార్టీ నుంచి సస్పెండ్ చేయడం వంటి కార్యక్రమాలు జరగాల్సి ఉంది. నెల్లూరు రూరల్ ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ప్రభుత్వం, పార్టీ విధానాలను విమర్శించారు. ఆయన పార్టీ మారుతారని ప్రచారం సాగింది. దీంతో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఆయనను తన వద్దకు పిలిపించుకొని ఏం జరిగింది. ఏం కావాలో అడిగి తెలుసుకొని బుజ్జగించారు. నియోజకవర్గానికి నిధులు ఇవ్వడంతోపాటు, టికెట్ విషయంలో భరోసా ఇచ్చినట్లు తెలిసింది. తన సోదరుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి రాష్ట్రసేవాదళ్ అధ్యక్షులుగా నియమించారు. కోటంరెడ్డి సోదరులు పార్టీని వీడకుండా నేరుగా ముఖ్యమంత్రే చొరవ తీసుకున్నారని తెలుస్తోంది. నెల్లూరు ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి కొంత అసంతృప్తితో ఉన్నట్లు సమచారం. వచ్చే ఎన్నికల్లో పోటీచేయకపోయినా తన అల్లుడు ప్రముఖ కాంట్రాక్టర్ మురళీరెడ్డిని టిడిపి ఎంపి అభ్యర్థిగా నిలపాలని ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. వైసిపి నెల్లూరు ఎంపి అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పోటీలో ఉండేలా సిఎం నచ్చచెప్పినట్లు సమాచారం. మాగుంట కుటుంబం టిడిపిలోకి వచ్చే అవకాశాలున్నాయని ఆపార్టీ నేతలు, ద్వారా తెలుస్తోంది. ప్రముఖ వ్యాపారులు, కాంట్రాక్టర్లు, టిడిపి వైపు చూస్తున్నట్లు తెలుస్తోంది. ఇందుకు ప్రధాన కారణంగా ప్రభుత్వంపై వ్యతిరేకత ఉందని , టిడిపి గెలిచే అవకాశాలున్నాయని తెలియడంతో కాంట్రాక్టర్లు, కార్పొరేట్ శక్తులు పార్టీలు మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇవి కాకుండా ఉదయగిరి నియోజకవర్గం నుంచి ఎన్ఆర్ఐలు దృష్టిపెట్టారు. అమెరికాలో స్థిరపడ్డ జిల్లా వాసి సురేష్ ఉదయగిరిపై దృష్టిపెట్టారు. వరికుంటపాడు కేంద్రంగా స్వచ్ఛంద సంస్థను స్థాపించి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇటీవల చంద్రబాబు పర్యటనలోనూ కనిపించారు. కావలి నియోజకవర్గలో టిడిపి అభ్యర్థి ఎవరనేది స్పష్టం కాలేదు. ఉదయగిరికి చెందిన వైసిపి నేత, కాంట్రాక్టర్ చేజర్ల సుబ్బారెడ్డి , జలదంకికి చెందిన కావ్య కృష్ణారెడ్డిలు గోడమీద పిల్లిలా కాచుకున్నట్లు తెలుస్తోంది. టికెట్ ఇస్తామంటే పార్టీలో చేరడానికి సిద్ధమైనట్లు తెలుస్తోంది. వైసిపిలో కొనసాగుతూనే ఉదయగిరి ఎంఎల్ఎతో చేజర్ల సుబ్బారెడ్డికి వివాదం కొనసాగుతోంది. నువ్వేంతంటే నువ్వేంతం టున్నారు. టిడిపి నేతలు ఆత్మకూరులో అభ్యర్థి విషయం కూడా ఆసక్తిగా గమనిస్తున్నారు. ఆనం కుటుంబం నుంచి ఎవరు ఉంటారో తెలియడం లేదు. వెంకటగిరి, నెల్లూరు రూరల్, నెల్లూరు, కావలి, నియోజకవర్గాల్లో అభ్యర్థులపై స్పష్టత కనిపించడం లేదు. వైసిపి నేతలు పార్టీ నుంచి వెళ్లిన వారిపై దృష్టిపెట్టినట్లు తెలుస్తోంది. రానున్న రోజుల్లో నెల్లూరు జిల్లా రాజకీయం పూర్తిగా మారిపోయే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఇద్దరు టిడిపి నేతలు అరెస్టు

కందుకూరు తొక్కిసలాట ఘటనపై చర్యలు

ఇంటూరి నాగేశ్వరరావు

ఇంటూరి రాజేష్

ప్రజాశక్తి -కందుకూరు : ఇటీవల కందుకూరు చంద్రబాబు నాయుడు సభలో తొక్కిసలాట జరిగి ఎనిమిది మంది మృతిచెందడానికి కారకులుగా భావిస్తున్న టిడిపి నాయకులు ఇంటూరి నాగేశ్వరరావు, ఇంటూరి రాజేష్‌లను గురువారం పోలీసులు హైదరాబాదులో అరెస్ట్ చేశారు. గత నెల 28వ తేదీ చంద్రబాబు నాయుడు రోడ్డు షోలో తొక్కిసలాట జరిగిన విషయం తెలిసిందే. సంఘటన జరిగిన రోజు పోలీసులు 174 కింద కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం ఐపిసి 304 పార్ట్ -2 కింద కేసు నమోదు చేశారు. కందుకూరు పోలీసులు గురువారం రెండు కార్లలో హైదరాబాదు వెళ్లి కందుకూరు తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జ్ నాగేశ్వరరావును మియాపూర్‌లోని తన కార్యాలయంలో ఉండగా అదుపులోకి తీసుకున్నారు. నెల్లూరు పార్లమెంటు టిడిపి ఉపాధ్యక్షుడు ఇంటూరి రాజేష్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. రోడ్డు షో కి సంబంధించి నాగేశ్వరరావు, రాజేష్ ఇద్దరూ భారీ ఏర్పాట్లు చేశారు. సభ నిర్వహణకు కారకులుగా నిర్ధయించి రాజేష్, నాగేశ్వరరావులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. కందుకూరు నుండి రెండు కార్లలో హైదరాబాదు వెళ్లిన పోలీసులు వారిని అరెస్టు చేసి కందుకూరు తీసుకొస్తున్నట్లు సమాచారం. తొక్కిసలాటలో చనిపోయిన ఎనిమిది మంది కుటుంబ సభ్యులకు భారీ స్థాయిలో ఆర్థిక సహాయం తెలుగుదేశం పార్టీ చేసింది. ఈ తరుణంలో నాగేశ్వరరావు, రాజేష్‌లను పోలీసులు అరెస్టు చేశారనే వార్త కందుకూరు పట్టణంలో పెద్ద ఎత్తున చర్చినీ యాంశంగా మారింది. అధికార పార్టీ కావాలనే టిడిపి నాయకులు పై అక్రమ కేసులు బనాయించి వేధిస్తున్నారని టిడిపి నాయకులు ఆరోపిస్తున్నారు.

దళితులపై దాడిచేస్తే కేసులు పెట్టరా..?

బాధితుడికి మెరుగైన వైద్యమందించాలి -దగదర్తిలో కెవిపిఎస్ నిరసన

పోలీసులతో వాగ్వాదం చేస్తున్న కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆంద్ర మాల్యాద్రి, సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్

ప్రజాశక్తి-దగదర్తి

" దళితులపై దాడులు చేసి, హత్యాయత్నంచేస్తే కనీసం కేసు పెట్టరా ? అని కెవిపిఎస్ నేతలు పోలీసు అధికారులను నిలదీశారు. నెల్లూరు జిల్లా దగదర్తి మండలంలో వైసిపి నేత, ఎంపిటిసి మహేష్ ఉచితంగా పెట్రోల్ పోయలేదని సాకుతో దళితుడు గోచిపాతల తేజపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచాడు. ఆ యువకుడు నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గురువారం కెవిపిస్ రాష్ట్ర కార్యదర్శి ఆంద్ర మాల్యాద్రి నేతృత్వంలో ప్రతినిధి బృందం ఆ గ్రామాన్ని సందర్శించింది. అక్కడ జరిగిన సంఘటనను గురించి వివరాలు అడిగితెలుసుకున్నారు.. దగదర్తిలోని జక్కా వెంకయ్య విజ్ఞాన కేంద్రంలో స్థానిక ప్రజలలతో సమావేశమ య్యారు.ఈ సందర్భంగా మాల్యాద్రి మాట్లాడుతూ దగదర్తి మండలంలోని ఉలవపాళ్ల దగ్గర ఉన్న ఐఓసీ పెట్రోల్ బంకులో పనిచేస్తున్న గోచిపాతల తేజపై బాడిగుడిపాడు వైసిపి ఎంపిటిసి మహేష్ నాయుడు తన డ్రైవర్ మస్తాన్‌తో కలిసి విచక్షణారహితంగా దాడి చేయడం దారుణ మన్నారు. దాడి చేసిన వ్యక్తి పై పోలీసులు తూతూ మంత్రంగా కేసు నమోదు చేసి చేతులు దులుపుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దళిత యువకునిపై మారణా యుధాలతో దాడి చేసిన వారిపై 307 కేసు నమోదు ఎందుకు చేయలేదని పోలీసులను ప్రశ్నించారు. పొట్టకూటి కోసం ఓ పక్క చదువుకుంటూ మరోపక్క పార్ట్ టైం జాబ్ చేస్తూ కుటుంబాన్ని పోషించేందుకు నానా తంటాలు పడుతున్న పేదవాడిని కర్రలతో ఇష్టానుసారంగా దాడి చేయడం దారుణ మన్నారు. ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుని 307 కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ గతంలో ఉప్పలపాడు గ్రామంలో వేరే వాళ్ల పొలాన్ని తలారి రవి కౌలుకు తీసుకొని సాగు చేసుకుంటుండగా అదే గ్రామానికి చెందిన వ్యక్తులు పొలాన్ని దున్నించి కులం పేరుతో దూషించినా పోలీసులు ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు దీన్ని బట్టి చూస్తే దళితులను చిన్నచూపు చూస్తూ వారిపై దాడులు చేయడం దారుణమ న్నారు.తొలుత జక్కా వెంకయ్య విజ్ఞాన కేంద్రం నుంచి స్థానిక తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. మధ్యలో పోలీసులు వచ్చి అడ్డుకున్నారు. పోలీసులు నినాదాలు చేయకుండా వెళ్ళవచ్చని చెప్పారు. ఎస్‌సి, ఎస్‌టి కేసు విచారణ చేపట్టాలంటే తహశీల్దార్, ఎంపిడిఓ, ఎస్ఐ అధికారులకు విచారించే అధికారం ఉందని తెలిపారు. ఈ విషయమై తహశీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో కె.వి.పి.స్. జిల్లా కార్యదర్శి ఆలూరి తిరుపాలు, వ్య.కా.స. జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జొన్నలగడ్డ వెంకమరాజు, మంగళ పుల్లయ్య, సిపిఎం మండల కార్యదర్శి కర్ర పోలయ్య, సిఐటియు మండల నాయకులు వంటేరు సుధాకర్, నాయకులు పోతంశెట్టి రఘురామయ్య, మంద శీనయ్య, మంద మహేష్, దేవా, గురజాల వెంకటేశ్వర్లు, చల్లా మాలాద్రి, ఎంఆర్‌పిఎస్ నాయకులు మంచు తిరుపతి, ఉలవపాళ్ల, నారాయణపురం, ఉప్పలపాడు గ్రామస్తులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బకాయిల చెల్లిస్తాం..

ప్రజాశక్తి-నెల్లూరు

నగర పాలక సంస్థకు చెందిన చెత్త వాహన డ్రైవర్ల్లు తమ వేతన బకాయిలు చెల్లించేలా వారం రోజులుగా నిర్వహిస్తున్న రిలే దీక్షలను విరమించారు. గురువారం కార్పొరేషన్ కార్యాలయంలో రెడ్డి ఏజెన్సీ జిఎం రామ్‌కుమార్‌తో ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్, డ్రైవర్స్ యూనియన్ నాయకులు, చర్చలు నిర్వహించారు. గడిచిన వారం రోజుల నుంచి కార్పొరేషన్ కార్యాలయ ఆవరణంలో చెత్త వాహన డ్రైవర్లు రిలే దీక్షలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కమిషనర్ హరిత రెడ్డి ఏజన్సీ జిఎంనుం కార్పొరేషన్ కార్యాలయానికి పిలిపించి సమస్యను వెంటనే పరిష్కరించాలని సూచించారు. వెంటనే కార్మిక సంఘాల నాయకులను చర్చలకు రెడ్డి ఏజన్సీ ప్రతినిధులు ఆహ్వానించారు. ఈ చర్చల్లో భాగంగా చెత్త తరలించే వాహన డ్రైవర్ల సమస్యలన్నింటినీ ఒక వరుస క్రమంలో ఈ నెల 25వ తేది లోపల అన్ని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కారక్రమంలో సిఐటియు నగర, రూరల్ కార్యదర్శులు జి.నాగేశ్వరరావు, కిన్నెరకుమార్, ఏపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి కె.పెంచలనర్సయ్య, కొండా ప్రసాద్, సూరి, శ్రీనివాసులు, బత్తల కృష్ణయ్య, సునీల్ పాల్గొన్నారు.

శ్రీనివాసులురెడ్డి కోలుకోవాలని ప్రార్థనలు

ప్రజాశక్తి-నెల్లూరు : నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలపై పోరాటం చేస్తున్న టిడిపి సిటీ ఇన్‌ఛార్జి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి త్వరగా కోలుకోవాలని మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు మోయి ౧నుద్దీన్ పేర్కొన్నారు. గురువారం సిటీ మైనారిటీ సెల్ అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ ఆధ్వర్యంలో మత పెద్దలతో కోటంరెడ్డి నివాసంలో ప్రార్ధనలు నిర్వహించారు. ఆకతాయి చేతిలో గాయపడ్డ కోటంరెడ్డి ఆరోగ్యం త్వరగా కుదుట పడాలని ఆయన ఆకాంక్షించారు.. కువ్వరపు బాలాజీ, మైనార్టీ నాయకులు యశ్రాబ్, అబ్దుల్ మస్తాన్, జహీర్, ఉస్మాన్, నవాజ్, హజ్రత్ అలీ, మంజూరు, ముజాహిద్దీన్, సమి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు కరేడు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి -ఉలవపాడు :మండలంలోని కరేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధా నోపాధ్యాయులు ఆవుల శ్రీనివాసరావు తెలిపారు. ఇటీవల శింగరాయకొండలో జరిగిన జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్ అండర్ 14, 17 బాల, బాలికల ఎంపిక పోటీల్లో పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న కాటం దుర్గారావు, చేవురి తిరుపతయ్య, 9వ తరగతి చదువుతున్న కటారి తేజ అండర్ 17 బాలుర విభాగంలో జిల్లా జట్టుకు ఎంపికైనట్లు పాఠశాల ఫిజికల్ డైరక్టర్ ఓగుబోయిన శ్రీనివాసులు చెప్పారు. వీరు ఈ నెల 20వ తేదీ నుండి 22తేదీ వరకు కర్నూల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల సిబ్బంది, పాఠశాల పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ బొడ్డు శ్రీధర్ రెడ్డి, గ్రామస్తులు అభినందించారు.

ఎంఆర్‌పిఎస్ జాతీయ సదస్సుకు తరలిరండి..

కందుకూరు :ఈ నెల 11న బెంగళూరులో జరిగే ఎంఆర్‌పిఎస్ జాతీయ సదస్సును జయప్రదం చేయాలని ఎంఆర్‌పిఎస్ జాతీయ ఉపాధ్యక్షులు, ఉమ్మడి ప్రకాశం జిల్లా ఇన్‌ఛార్జి జలదంకి నరశింగరావు మాదిగ తెలిపారు. మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు గ్రామ గ్రామాన ఎంఆర్‌పిఎస్‌ని బలోపేతం చేయుటలో భాగంగా గురువారం ఆనందాపురం గ్రామంలో మాదిగ యువకులతో కలిసి ఎస్సీ వర్గీకరణ సాధిం చుకోవడంలో మాదిగ యువకులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. బొక్క వెంకటేశ్వర్లు, ఏడుకొండలు, సుబ్బారావు, మహేంద్ర, ప్రవీణు,మధు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - లింగసముద్రం : మండల భారత్ ముక్తి మోర్చా నూతన కమిటీని ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు సావిత్రి భాయి పూలే 192వ జయంతిని పురస్కరించుకొని బుధవారం మండల కమిటీ సమావేశం జరిగింది.ఈ సమావేశంలో గౌరవాధ్యక్షులుగా కొండలరావు, మండల అధ్యక్షులుగా జొన్నకూటి మోహనరావు,ప్రధాన కార్యదర్శిగా అమీర్జాన్, ఉపాధ్యక్షులుగా ఎ.విజయ్, సహాయ కార్యదర్శిగా గంగోలు మణికుమార్, కోశాధికారిగా ఎం.మాధవరావు, కమిటీ సభ్యులుగా జి.కిరణ్,బి.రాజేష్‌లను ఎన్ను కున్నారు. సామాజిక ఐక్యవేదిక అధ్యక్షుడు,భాంసేఫ్ గౌరాధ్యక్షులు పూరిమిట్ల బాలకోటయ్య,బిఎంఎం రాష్ట్ర అధ్యక్షులు జి.వెంకట్రావు,బిఎంఎం జిల్లా సభ్యులు పురుషోత్తం,భాంసేఫ్ నాయకులు పూరిమిట్ల మాధవరావు,బిఎంఎం జిల్లా అధ్యక్షులు జహీర్ పాల్గొన్నారు.

పింఛన్లు పంపిణీ

పొదలకూరు : భారతదేశంలోనే పింఛన్ల పంపిణీలో ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా నిలిచిందని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎంపిడిఓ కార్యాలయ ఆవరణంలో గురువారం ఏర్పాటు చేసిన వైఎస్ఆర్ పెన్షన్ కానుక పంపిణీ సమావేశంలో పాల్గొన్న ఆయన నూతనంగా మంజూరైన సామాజిక పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. పొదలకూరు సర్పంచ్ మల్లిక చిట్టెమ్మ, ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులు రెడ్డి, పొదలకూరు మండల ఉపాధ్యక్షులు వి చంద్రశేఖర్ రెడ్డి, సోమా అరుణ, ఎంపీటీసీ గుంటి శ్రీనివాసులు, షేక్ షాకీరా,తాసిల్దార్ ప్రసాద్, ఎంపీడీవో నగేష్ కుమారి పాల్గొన్నారు.

తోటపల్లిగూడూరు : నిరుపేదలకు అండగా వైసీపీ ప్రభుత్వం నిలుస్తోందని, ఈ ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి దక్కుతుందని వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం తోటపల్లిగూడూరు ఎంపిడిఓ కార్యాలయ ప్రాంగణంలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. వైసిపి రాష్ట్ర కార్యదర్శి, విజయ డైరీ మాజీ ఛైర్మన్ చిల్లకూరు సుధీర్ రెడ్డి, కన్వీనర్ ఉప్పల శంకరయ్య గౌడ్, ఎంపీపీ స్వర్ణలత, జెడ్పిటిసి శేషమ్మ, ఏఎంసి డైరెక్టర్ మన్నెం సుబ్రహ్మణ్యం గౌడ్, తలమంచి సురేంద్ర బాబు, ఎంపీడీఓ హేమలత, తహశీల్దార్ హమీద్ పాల్గొన్నారు.

గుడ్లూరు : సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలను మునుపెన్నడూ లేని విధంగా అందించడం జరుగుతుందని ఎంఎల్ఎ మానుగుంట మహీధర్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఎంపీడీవో శ్రీనివాసులు రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జెడ్పిటిసి కొరిసేపాటి బాపిరెడ్డి ,ఎంపీపీ పులి రమేష్ ఉన్నారు.

జెన్కోను ప్రయివేటీకరించొద్దు

నెల్లూరు : ప్రభుత్వం ప్రయివేటు సంస్థల నుంచి విద్యుత్‌ను కొనుగోలు చేసి ప్రజలపై ప్రభుత్వం తీవ్ర భారాలు మోపడం దారుణమని, ఈ ఆలోచనను విరమించుకోవాలని సిపిఎం , ప్రజా సంఘాలు జిల్లా విద్యుత్ ప్రధానాధికారికి వినతి పత్రం అందజే శాయి. గురువారం నగరంలోని విద్యుత్ భవన్‌లోని ఎస్ఈ ఛాంబర్‌లో కలిసిన నాయకులు మాట్లా డుతూ రాష్ట్ర ప్రభుత్వం జెన్కోను ప్రయివేటుపరం చేయరాదని, అదాని సౌర విద్యుత్ సంస్థ నుండి రాష్ట్ర అవసరాలకు విద్యుత్‌ను కొనుగోలు చేయరాదని ఈ చర్యలను సిపిఎం, సిఐటియు, ఎస్ఎఫ్ఐ సంఘాలు వ్యతిరేకిస్తున్నా యన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు , సిపిఎం రూరల్ కార్యదర్శి బత్తల కష్ణయ్య , పార్టీ జిల్లా కమిటీ సభ్యులు అల్లాడి గోపాల్ , సిఐటియు రూరల్ అధ్యక్షులు కొండ ప్రసాద్ , ఎస్ఎఫ్ఐ రూరల్ అధ్యక్షులు సుకుమార్ , ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె. సురేష్ , భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నాయకులతో చర్చిస్తున్న దృశ్యం

మధ్యాహ్న భోజన కార్మికురాలికి న్యాయం చేయాలి

ప్రజాశక్తి-నెల్లూరు:పొదలకూరు మండలం వావింతపర్తి (వావింటపర్తి) గ్రామం, మండల ప్రజాపరిషత్తు ప్రాథమిక పాఠశాలలో గత 19 ఏళ్లుగా మధ్యాహ్నభోజన పథకం కార్మికురాలు కలవకూరు విజయమ్మను అక్రమంగా విధుల నుంచి తొలగించిన ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్. సుబ్రమణ్యంను సస్పెండ్ చేయాలని కోరుతూ మధ్యాహ్న భోజన పథకం యూనియన్ డిఇఒకు వినతిపత్రం అందజేసింది. గురువారం నగరంలోని జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో ఇన్‌ఛార్జి డిఇఒను కలిసిన ఆ జిల్లా కమిటీ కార్యదర్శి రెహానాబేగం వినతిపత్రం అందజేసింది. 19 సంవత్సరాల నుంచి ఎటువంటి రిమార్కు లేకుండా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండిస్తున్న కార్మికురాలిని అక్రమంగా విధుల నుంచి తొలగించడం దారుణమన్నారు. పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి మధ్యాహ్నభోజన పథకం కార్మికురాలికి న్యాయం చేయాలని కోరారు. బాధితురాలికి న్యాయం జరగని పక్షంలో డిఇఒ కార్యాలయం ఎదుట ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న రెహానాబేగం

కరపత్రం ఆవిష్కరణ

ప్రజాశక్తి-నెల్లూరు :సంక్రాంతి సందర్భంగా డివైఎఫ్ఐ రూరల్ కమిటీ ఆధ్వర్యంలో ఎసి సుబ్బారెడ్డి ఇండోర్ స్టేడియంలో ఈ నెల 14వ తేదిన షటిల్ బ్యాడ్మింటన్ పోటీలుకు సంబంధించిన కరపత్రాలను డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న ఆవిష్కరించారు. గురువారం నగరంలోని డాక్టర్ రామచంద్రారెడ్డి భవన్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఈ కరపత్రాల ఆవిష్కరణ చేపట్టారు. ఈ సందర్భంగా రామన్న మాట్లాడుతూ దేశంలో యువత సమస్యలు పరిష్కరించే విధంగా పోరాడే సత్తా ఒక్క డివైఎఫ్‌కు మాత్రమే ఉందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ శాఖలో ఉన్న ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని నిరుద్యోగ సమస్యలు పరిష్కారం దిశగా అనేక పోరాటాలు నిర్వహించి విజయం సాధించిన ఘనత డివైఎఫ్ఐకే దక్కుతుందన్నారు.పోరాటాలే కాకుండా సేవా కార్యక్రమాలైన రక్తదానం, మొక్కలు నాటడం, చలివేంద్రాలు ఏర్పాటు చేయడం వంటి కార్యక్రమాలు యువజన సంఘం నిర్వహిస్తుందన్నారు. విపత్తుల సంబంధించినప్పుడు విరాళాలు సేకరించి నష్టపోయిన వారికి అందించేలా కషి చేస్తుందన్నారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నరసింహ ,రమణ, స్పోర్ట్స్ కన్వీనర్ కో కన్వీనర్లు దేవతాటి సతీష్ ,దేవతాటి రాజా , రూరల్ డివైఎఫ్ఐ అధ్యక్షుడు వంకదారి శ్రీనివాసులు, కండె కోటేశ్వరరావు కోశాధికారి డబ్బుగుంట శ్రీనివాసులు, కమిటీ సభ్యులు చైతన్య తరుణ్



ప్రభుత్వ ఆస్పత్రిలో మెరుగైన వైద్యసేవలు

ప్రజాశక్తి -కందుకూరు : కందుకూరు ఏరియా వైద్యశాల పేదలకు మంచి వైద్యం అందించడానికి డాక్టర్లు, సిబ్బంది కషి చేయాలని ఎంఎల్ఎ మానుగుంట మహీధర్ రెడ్డి కోరారు. గురువారం ఏరియా వైద్యశాల అభివద్ధి కమిటీ సమావేశం జరిగింది. మహీధర్ రెడ్డి మాట్లాడుతూ 2022లో డాక్టర్లు ,సిబ్బంది ప్రజలకు మంచి సేవలు అందించి ఆస్పత్రికి పేరు ప్రతిష్ఠలు తీసుకొచ్చారని తెలిపారు. చంద్రబాబు నాయుడు సభలో గాయపడిన వారిని ఏరియా వైద్యశాలకు తీసుకువచ్చిన సందర్భంలో సిబ్బంది, డాక్టర్లు చేసిన కషికి ఆయన అభినందనలు తెలిపారు. ౧. డాక్టర్ల సంఖ్య పెరుగుతుందనే ఆనందంతో పాటు బదిలీలపై వెళుతున్న వారిని చూసి బాధ కూడా కలుగుతుంది అన్నారు. సిబ్బంది విషయం సెక్రటరీ తో మాట్లాడతానని మహీధర్ రెడ్డి చెప్పారు. అత్యవసర సమయంలో దేనికి వెనకాడ వద్దని ఎంతైనా ఖర్చు చేద్దామని ప్రజల ప్రాణాలు ముఖ్యమని మహీధర్ రెడ్డి చెప్పారు. సమావేశంలో ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ శకుంతల పాల్గొన్నారు.

జిఓ నెంబర్ ఒకటి ప్రతులు దగ్ధం

నెల్లూరు :వైసిపి ప్రభుత్వ పాలన వైఫల్యాన్ని కప్పిపుచ్చుకొనేందుకు జిఓ నెంబరు ఒకటిని తీసుకొచ్చారని డివైఎఫ్ఐ జిల్లా కమిటీ విమర్శించింది. గురువారం నగరంలోని జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద ఇటీవల వైసిపి ప్రభుత్వం విడుదల చేసిన జి నెంబరు ఒకటి ప్రతులను భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య దగ్ధం చేసింది. ముందుగా బాలాజీనగర్‌లోని డివైఎఫ్ఐ కార్యాలయం నుంచి నుంచి మినిబైపాస్ రోడ్డులోని జ్యోతిరావు పూలే దంపతుల విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. జివో కాపీలను దగ్ధం చేశారు. డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న , జిల్లా కార్యదర్శి ఎం వి రమణ, జిల్లా అధ్యక్షులు బిపి నరసింహ, రూరల్ కార్యదర్శి కండే కోటేశ్వరరావు, వంకదారి శ్రీనివాసులు, మాధవ్, పెంచల నరసింహ, డబ్బు గుంట శ్రీనివాసులు, సతీష్, చైతన్య ఉన్నారు.

టిడిపి ఆధ్వర్యంలో.. టిడిపి రూరల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి అబ్దుల్ అజీజ్ ఆధ్వర్యంలో చంద్రబాబునాయుడు కుప్పం పర్యటనను పోలీసులు అడ్డుకోవడాన్ని, ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జిఓ నెంబర్ 1 ను వ్యతిరేకిస్తూ నగరంలోని అంబేద్కర్ కూడలి వద్ద టిడిపి నేతలు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించారు.

కందుకూరు: స్థానిక టిడిపి కార్యాలయం నుంచి అంబేద్కర్ విగ్రహం దగ్గరకు వెళ్లేందుకు బయలుదేరిన టిడిపి నాయకులను సిఐ వెంకటరావు ఆధ్వర్యంలో పోలీసులు గురువారం అడ్డుకున్నారు. పోలీసులతో కంచర్ల శ్రీకాంత్, దామా మల్లేశ్వరరావుల వాగ్వాదానికి దిగారు. అంబేద్కర్ విగ్రహం దగ్గరకు అనుమతించాలని పోలీసులను కోరారు.

నెల్లూరులో..

కందుకూరు సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో గురువారం ఆర్డీవో కార్యాలయం వద్ద జీవో కాపీని దగ్ధం చేయటం జరిగింది. అనంతరం ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా ప్రజల హక్కులు కాలరాసే విధంగా ఉన్న జిఓ నెంబర్ 1ని ఉపసం హరించుకోవాలని సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్‌కి వినతిపత్రం ఇచ్చారు. సిపిఎం, సిపిఐ నాయకులు ఎస్ఎ గౌస్, బి సురేష్, డిరామ్మూర్తి, పి మాలకొండయ్య, ఎం ప్రసాద్, డి ఎం రాయుడు, హుస్సేన్, టి వెంకట్రావు, ఎం పద్మ ,ఎస్కే షాహీదా పాల్గొన్నారు.

కందుకూరులో..

రెవెన్యూ వసూళ్లు వేగవంతం

ప్రజాశక్తి-నెల్లూరు :నగర పాలక సంస్థ పరిధిలో ఆస్తి పన్ను, కమర్షియల్ భవనాల పన్నుల వసూళ్లకై రెవెన్యూశాఖకు నిర్దేశించిన లక్ష్యాలను వేగవంతంగా పూర్తి చేయాలని కమిషనర్ హరిత రెవెన్యూ అధికారులకు సూచించారు. డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, అధికారులు పాల్గొన్నారు.

డాక్టర్ కెవి రెడ్డి మృతి తీరని లోటు

నెల్లూరు :వైద్య ఆరోగ్యశాఖలో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి, ఉద్యోగ విరమణ చేసిన అనంతరం పలు ట్రస్టుల ద్వారా ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి సేవలందించిన డాక్టర్ కెవి రెడ్డి మృతి బాధాకరమని వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగ సంఘం నాయకులు పేర్కొన్నారు. గురువారం స్థానిక హరినాథపురం ప్రాంతంలోని ఓ ప్రయివేట్ భవనంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో డాక్టర్ కెవిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. రిటైర్డ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎ. హరిబాబు, జిల్లా సెక్రెటరీ కె. శ్రీనివాసులు, హంస జిల్లా అధ్యక్షులు చేజెర్ల సుధాకర్ రావు, గౌరవాధ్యక్షులు డాక్టర్ విద్యాసాగర్, అసోసియేట్ ప్రెసిడెంట్ ఇందిరా , డాక్టర్ బి కష్ణమూర్తి, డాక్టర్ మున్వర్ సుల్తానా, మస్తానయ్య, కామేశ్వరి, రాజసులోచన ఉన్నారు.

జగనన్న కాలనీ పనులు వేగవంతం

నెల్లూరు :నవరత్నాలు పథకంలో భాగంగా పేదలందరికీ శాశ్వత గహ వసతి కల్పించే దిశగా రూపొందిస్తున్న జగనన్న కాలనీల్లో నిర్మాణ పనులను వేగవంతం చేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ హరిత ఆదేశించారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో ఎ.పి హౌసింగ్ కార్పొరేషన్ అధికారులతో జగనన్న కాలనీ లే అవుట్ల నిర్మాణంపై సమీక్షా సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. హౌసింగ్ కార్పొరేషన్ డి.ఈ లు దయాకర్, శ్రీహరి గోపాల్, ఏ.ఈ లు పాల్గొన్నారు.

పట్టణ ప్రణాళికపై సమీక్ష

ప్రజాశక్తి -కందుకూరు : స్థానిక పురపాలకసంఘం పరిధిలో ప్రభుత్వం వారిచే ప్రతిష్టాత్మకముగా జగనన్న శాశ్వత భు హక్కు, భూరక్ష" పథకానికి సంభంధించి గురువారం కమిషనర్ ఎస్ మనోహర్ సమావేశం నిర్వహిచారు. కందుకూరు ముసాయిదా మాస్టర్ ప్లాన్‌లో ప్రజల నుంచి వచ్చిన అభ్యంతరాలు, సలహాల మేరకు కార్యాలయం పట్టణ ప్రణాళిక సిబ్బంది, ప్లానింగ్, రెగ్యులేషన్ సెక్రటరీలతో ఆయన మాట్లాడారు.

తల్లి మందలించిందని పారిపోయిన బాలుడు

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు :అలిగి ఇంటి నుంచి పారిపోయిన బాలుడిని పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. కష్ణపట్నం సిఐ కె. వేమారెడ్డి తెలిపిన వివరాల మేరకు విడవ లూరు గ్రామానికి చెందిన చవుటూరు విష్ణు మహేంద్ర అనే ఏడేళ్ల బాలుడు తన తల్లి తిట్టిందని అలిగి ఇంటి నుంచి పారిపోయి మండలంలోని వరకవిపూడి చేరుకొన్నాడు. వీధుల్లో తచ్చాడుతున్న బాలుడి వాలకాన్ని గమనించిన మహిళా పోలీస్ సుమలత రాజ్ గుర్తు తెలియని ఆ బాలుడి సమాచారాన్ని సిఐ వేమారెడ్డికి చేరావేశారు. వెంటనే స్పందించిన సిఐ వేమారెడ్డి బాలుడి ఫోటో, వివరాలను నెల్లూరు రూరల్ సబ్ డివిజన్, సబ్ డివిజన్ పరిధిలోని అన్ని మహిళా పోలీసు గ్రూపులో పోస్ట్ చేశారు. ఈ సమాచారాన్ని అందుకున్న విడవలూరు ఎస్ఐ వాసు చేపట్టిన విచారణలో ఇంటి నుంచి పారిపోయిన బాలుడు విష్ణు మహేంద్ర విడవలూరు గ్రామానికి చెందిన చవుటూరు పోలమ్మ కుమారుడు అని నిర్ధారించారు. మహిళా పోలీసు సుమలత రాజ్ వద్ద భద్రంగా వున్న బాలుడిని సీఐ వేమారెడ్డి తోటపల్లిగూడూరు పోలీస్ స్టేషన్ కు రప్పించి సమాచారాన్ని తల్లి పోలమ్మకు అందజేశారు. తప్పిపోయిన తన కుమారుడు విష్ణు మహేంద్ర సమాచారం అందుకున్న తల్లి పోలమ్మ సిఐ వేమారెడ్డి సంరక్షణలో ఉన్న కుమారుడిని గుండెలకు హత్తుకొని ఆనందభాష్పాలు రాల్చింది. తమ కుమారుడిన తన వద్దకు చేర్చిన సీఐ వేమారెడ్డికి, మహిళా పోలీసు సుమలత రాజ్ కు తల్లి పోలమ్మ కత్జలు తెలిపింది. కుమారుడిని తీసుకొని సంతోషంతో ఇంటి ముఖం పట్టింది. కాగా తప్పిపోయిన బాలుని విషయంలో ప్రత్యేక శ్రద్ద చూపిన మహిళా పోలీస్ సుమలత రాజ్ ను సీఐ వేమారెడ్డి ప్రత్యేకంగా అభినందించి రివార్డు కోసం ఉన్నతాధికారులకు సిఫార్సు చేశారు.

ఎస్ఐపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-కావలి: దగదర్తి పెట్రోల్ బంక్‌లో పని చేస్తున్న దళిత విద్యార్థి గోచిపాతల తేజ పై విచక్షణ రాహిత్యంగా దాడి చేసి, దుడ్డు కర్రతో చంపే ప్రయత్నం చేసిన మహేష్ నాయుడి పై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని సిపిఐ ఎం ఎల్ (న్యూ డెమొక్రసీ) జిల్లా కార్యదర్శి కరవది భాస్కర్ డిమాండ్ చేశారు. అధికార అహంకారంతో, కుల ఉన్మాదంతోనే దళిత విద్యార్థి పై అత్యంత పాశవికంగా దాడి జరిగింది. మహేష్ నాయుడు చేసిన దాడి దశ్యాలు స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ కూడా పోలీసులు నిందితుడిని కాపాడడానికి కేసును నీరు కార్చుతున్నారన్నారు. దుడ్డు కర్రతో తీవ్రంగా కొడుతున్న దశ్యం కనపడుతున్నా ఎందుకు హత్యాయత్నం కేసు నమోదు చేయడం లేదని ప్రశ్నించారు. మహేష్ నాయుడు దాడికి ముందు పోలీసు, ఎస్ఐ మహేష్ నాయుడు నీకు తెలియదంటరా! అని తేజను ఫోన్లో బెదిరించి నందువలనే, ఆపోలీసు అండ చూసుకునే దాడికి తెగబడ్డాన్నారు. కనుక తేజను ఫోన్లో బెదిరించిన ఎస్ఐపై కూడా కఠినమైన చర్యలు తీసుకోవాలన్నారు. దళితులకు రక్షణ కల్పించాల్సిన పోలీసులే దాడికి ప్రోత్సాహం ఇవ్వడం మరింత దారుణమన్నారు. కావలి నియోజక వర్గంలో అధికార పార్టీ అండదండలతో దళితులపైన నిరంతరం దాడులు జరుగుతూనే ఉన్నాయన్నారు. దళితులు వై.సి.పి.కి ఓట్లేసిన పాపానికి దాడులు, హత్యలు, బహిష్కరణలు అధికారపార్టీ ఇస్తున్నదన్నారు. ఇప్పటికైనా అధికార పార్టీ దళితులపై దాడులకు స్వస్తి పలకాలని, లేని పక్షంలో ఇదే దళితులు అధికార పార్టీని చెత్త బుట్టలోకి విసరడం ఖాయమన్నారు. కావలిలో శాంతి భద్రతలు విఘాతం కలగకుండా పని చేయాల్సిన పోలీసు వ్యవస్థ అధికార పార్టీకి పని చేయడం సరి కాదన్నారు. శాంతిభద్రతలు దిగజారితే అందుకు పోలీసులే కారణమవ్వడం ప్రజాస్వామ్యానికి మంచిదికాదన్నారు. అందువలన నిందితుల పట్ల కఠిన వైఖరి ఉండాలన్నారు. తక్షణమే మహేష్ నాయుడు పై హత్యాయత్నం కేసునమోదు చేయాలని.సి.పి.ఐ (ఎం.ఎల్)న్యూడెమోక్రసీ డిమాండ్ చేస్తుందని తెలిపారు

ఘనంగా గ్రామోత్సవం

ప్రజాశక్తి-అల్లూరు: గంగమ్మ, కలుగోళమ్మ,పోలేరమ్మ ముగ్గురు అమ్మవార్ల ఉత్సవం భారీ స్థాయిలో విజయవంతగా ముందుకు సాగిందని అల్లూరు మాజీ శాసనసభ్యులు కాటంరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రం ఆయన స్వగహంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ పోలేరమ్మ ఆశీస్సులు గ్రామ ప్రజలపై మెండుగా ఉన్నాయని తెలియజేశారు. ముగ్గురు అక్కచెల్లెళ్ల ఉత్సవాలకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేకంగా కతజ్ఞతలు తెలిపారు. ఊర్లో ఉత్సవం

మాట్లాడుతున్న మాజీ ఎంఎల్ఎ కాటంరెడ్డ

చేయాలంటే ఎన్నో ఒడిదుడుకులు ఉంటాయని తద్వారా అమ్మవారి గ్రామోత్సవాలకు ప్రజలు ముందుండి నడిపించారన్నారు. ఊళ్ళో అన్ని కమ్యూనిటీ ప్రజలు ఉంటారని కాక గతంలో కొందరికి చిందు,తప్పెట్ల వ్యవహారంలో అనేక ఇబ్బందులు ఘర్షణలు తలెత్తేవని వివరించారు. ఈ గొడవల కారణంగా దాదాపు 32 సంవత్సరాలు పోలేరమ్మ ఉత్సవాన్ని ఆపీ వేయడం జరిగిందని విచారం వ్యక్తం చేశారు. అన్ని వర్గాల ప్రజలతో మాట్లాడి వారందరిని ఒప్పించి 13 ఏళ్ల నుండి సాంప్రదాయంగా ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అమ్మవార్ల ఉత్సవానికి రాష్ట్ర స్థాయి గుర్తింపు వచ్చిందని ఆశాభావం వ్యక్తపరిచారు. రెట్టింపు ఉత్సాహంతో ప్రతేడాది అమ్మవారి ఉత్సవాన్ని అంగరంగ వైభవంగా ముందుకు తీసుకు వెళ్తున్నామని వ్యాఖ్యానించారు. ఇందుకు సహరించిన ప్రతి ఒక్క అధికారికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది. ఆచారాలు, కట్టుబాట్ల నడుమ ముగ్గురు అమ్మవార్లను గ్రామంలో ఊరేగించి వారి ఆలయాలకు పంపడం జరిగిందన్నారు. కార్యక్రమంలో అనంతరాజు బాలకష్ణంరాజు, గోసల గోపాల్ రెడ్డి, గుండవరపు సుధాకర్ రెడ్డి, శేఖర్ రెడ్డి, మోహన్ రెడ్డి తదితరులున్నారు.

నూతన విద్యా విధానంపై సదస్సు

ప్రజాశక్తి-కావలి: నూతన విద్యావిధానంలో విద్యార్థి సృజనాత్మక శక్తికి పదును పెట్టబడటమేగాక విద్యసులభతరమౌతుందని బెంగుళూరు బిఎంఎస్ కాలేజ్ఆఫ్ ఇంజినీరింగ్ ప్రొ॥జి.వరప్రసాద్ తెలిపారు. గురువారం స్థానిక విట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన "మనదేశం భవిష్యత్‌లో అనుసరిస్తున్న నూతన విద్యావిధానం"పై జరిగిన అవగాహనా సదస్సులో ముఖ్యవక్తగా పాల్గొని మాట్లాడారు.విద్యార్థులు 6వతరగతి నుండి పరిశ్రమలలో అనేకరంగాలలో అనుసంధానమై ప్రాజెక్టు రిపోర్టులను కూడా సిద్ధంచేసే స్థాయికి ఎదుగుదల ఉంటుందని చెప్పారు.కార్యక్రమానికి విచ్చేసిన అధ్యాపకులను, వక్తను కాలేజీ చైర్మన్ దొడ్ల విద్యాధర్‌కుమార్‌రెడ్డి, అకడమిక్ డైరక్టర్ డాక్టర్ ప్రత్యూషాలు అభినందించారు.

బకాయిలు వెంటనే చెల్లించాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు మున్సిపాలిటీలో మున్సిపల్ కార్మిక సమస్యలు పరిష్కరించాలి అంటూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి)రాష్ట్ర నాయకులు సమావేశం నిర్వహించారు.కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు రంగనాయకులు మాట్లాడుతూ వేతనంలో నుంచి రికవరీ చేసిన అమౌంట్ కార్మికల ఖాతాలోకి నేటికీ జమ కావడం లేదన్నారు. కార్మికులకు పెండింగ్లో ఉన్న ఈపీఎఫ్ బకాయిని వెంటనే కార్మిక ఖాతాలోకి జమ చేయాలన్నారు. రిటైర్మెంట్ కార్మికులకు ఈపీఎఫ్ అమౌంటును పూర్తిస్థాయిలో కార్మికులకు ఇవ్వాలన్నారు.కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి జి కిషోర్, గౌరవ అధ్యక్షులు ఎం.అంకయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగరాజు, మున్సిపల్ కార్మిక నాయకులు హజరత్తయ్య, మునీర్ బాబు, పెంచలయ్య, చెంచయ్య, తదితర కార్మికులు పాల్గొన్నారు.

నేడు ఫైనల్ పోటీలకు సిద్ధం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్: స్థానిక ఎస్ ఆర్‌జె డిగ్రీ కళాశాల ప్రాంగణంలో రెండవ రోజు .విక్రమసింహపురి అంర్ కళాశాలల జోనల్ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ పి .డి సిరిమామిళ్ళ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ పోటీల్లో ఆత్మకూరు ఏఎస్ ఆర్ డిగ్రీ కళాశాల జట్టు బుచ్చి సెయింట్ మేరీస్ కళాశాలపై విజయం సాదించి ఫైనల్ కు చేరింది.. రెండవ సెమినార్ ఫైనల్ లో ఆత్మకూరు శ్రీ షిరిడీ సాయిరాం కళాశాల జట్టు డాక్టర్ ఎస్ ఆర్ జె డిగ్రీ కళాశాల విజయం సాధించి ఫైనల్ కు అర్హత సాధించాయని కళాశాల పిడి పోటీల నిర్వాహక కార్యదర్శి సిరిమామిళ్ళ వెంకటేశ్వర్లు తెలిపారు. ఫైనల్ పోటీలు 6వ తేది ఉదయం 9.30కి జరుగుతాయని పేర్కొన్నారు. కార్యక్రమ ంలో ప్రిన్సిపల్ వర కుమారి, యూనివర్సిటీ అబ్జర్వర్ డాక్టర్ ప్రవీణ్ కుమార్, లైబ్రేరియన్ టి.శ్రీనివాసులు రెడ్డి, అద్యాపకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి-ఉదయగిరి: బాలాజీ నగర్‌కు చెందిన కుమ్మిత.చాణక్య (19)అనే విద్యార్థి గురువారం అనంతపురంలోని జెఎన్‌టియు కాలేజీలో భవనం పైనుండి దూకి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన స్థానికంగా కలకలం రేపింది. బిటెక్ రెండవ సంవత్సరం చదువుతున్న చాణక్య సి సి సి భవనం పైనుండి దూకి ఆత్మహత్య కు పాల్పడటం ఆత్మహత్య కు గల కారణాలు

తెలియక పోవటం కుటుంబసభ్యులను ఆందోళనకు గురించేస్తున్నాయి. వరికుంటపాడు మండలం, జి. కొండారెడ్డి పల్లి గ్రామం నుంచి చాణక్య తల్లిదండ్రులు ఉదయగిరిలో నివాసం ఉంటున్నారు. చాణక్య తండ్రి మోటార్ మెకానిక్ తల్లి టైలర్ గా పనిచేస్తూ పిల్లల చదువు కోసమే కష్టపడుతూ ఉండేవారు. చదువులో చాలా చురుకుగా ఉన్న చాణక్య ఆత్మహత్య వార్త వినగానే కుటుంబం తో పాటు ఉదయగిరి గ్రామస్తులు సైతం ఆందోళన చెందారు. ఆత్మహత్య కు గల కారణాలు తెలియరాలేదని కళాశాల అధికారులు తెలిపినట్టు సమాచారం.

రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-బిట్రగుంట: యూరియా కొరతతో ఇబ్బంది పడుతున్న రైతులను ఆదుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బోగోలు మండల సిపిఎం కార్యదర్శి తుమ్మల వెంకయ్య పేర్కొన్నారు. మాండూస్ తుపాను కారణంగా తూర్పు ప్రాంతంలో వేసిన నారు ముళ్ళ తో నష్టపోయిన రైతులు సమస్యలపై యూరియా కొరత పై గురువారం తహశీల్దార్ కార్యాలయంలో వినతి పత్రాన్ని సిపిఎంమండల కార్యదర్శి తుమ్మల వెంకయ్య ,సిఐటియు మండల కార్యదర్శి చల్లా నరహరిలు డిప్యూటీ తహశీల్దార్ వెంకటేశ్వర్లకు అందజేశారు.కార్యక్రమంలో రైల్వే విశ్రాంత గార్డ్ ఉద్యోగి బ్రహ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

జిఒనెం ఒకటిని రద్దు చేయాలి

కావలిలో మాలెపాటి సుబ్బానాయుడుని హౌస్ అరెస్టు చేసిన దృశ్యం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

చంద్రబాబు నాయుడు కుప్పం పర్యటనను పోలీసులు అడ్డుకోవడాన్ని నిరసిస్తూ పట్టణంలోని గురువారం మున్సిపల్ బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద టిడిపి నాయకులు నిరసన తెలియజేశారు. తెదేపా అనుబంధ సంఘాలు టిఎన్ఎస్ఎఫ్‌తో కలిసి పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ నిరసన కొనసాగించే క్రమంలో పోలీసులు నిరసనను అడ్డుకొని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ నిరసనలో ఇంఛార్జి జగన్మోహన్ రెడ్డి దుర్మార్గపు పాలన నశించాలంటూ.. పోలీసుల దౌర్జన్యం నశించాలి అంటూ నినాదాలు పెద్ద ఎత్తున చేశారు. జీవో నెం1 ప్రతులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా పలువురు టిడిపి నాయకులు మాట్లాడుతూ చంద్ర బాబు నాయుడు కుప్పం పర్యటనకు వెళితే పోలీసులు అప్రకటిత ఎమర్జెన్సీ ప్రకటించి ఈ వేళ ఆయనను అడ్డుకోవడం దుర్మార్గ మన్నారు. జగన్మోహన్ రెడ్డి పాలనకు కాలం చెల్లింది అనేది ఈ జీఓతో స్పష్టంగా అర్థమవుతుందన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రజలను రక్షించాల్సిన బాధ్యత ప్రతిపక్షాల హక్కులను కాపాడాల్సిన బాధ్యత పోలీసు అధికారులపై ఉందన్నారు. అది గుర్తించి ప్రవర్తించాలని, రాబోయే ప్రభుత్వం తెలుగుదేశం అని గుర్తు చేశారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి దావా పెంచలరావు, రాష్ట్ర మహిళా కార్యదర్శి పులిమి శైలజా రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి వెంకట సుబ్బానాయుడు, తమ్మల చంద్రారెడ్డి, సుంకర పెంచలయ్య చౌదరి, అబ్బూరి రమేష్ నాయుడు, గొర్ల రవి, శ్రీకాంత్ నారాయణ ,టిఎన్ఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు. జిఒ నెం1ను వెంటనే రద్దు చేయాలని కోరుతూ గురువారం స్థానిక మున్సిపల్ బస్టాండ్ సెంటర్ అంబేద్కర్ విగ్రహం వద్ద తెలుగుదేశం పార్టీ శ్రేణులు నిరసనకు దిగారు. పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ నిరసన కొనసాగిస్తున్న తరుణంలో స్థానిక పోలీసులు నిరసన చేస్తున్న తెదేపా పార్టీ శ్రేణులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. విషయం తెలుసుకున్న సిపిఎం పట్టణ కార్యదర్శి డేవిడ్ రాజు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ సందాని, సిపిఎం నాయకులు ఎం.నాగేంద్ర పోలీస్ స్టేషన్ వద్దకు వెళ్లి వారిని కలిసి సిపిఎం తరపున వారికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధర్నాలు, ర్యాలీలు, నిరసనలు, అడ్డుకునేందుకు చీకటి జీవో నెం.1 తీసుకు రావడం ఉద్య మాలను చేయనివ్వకుండా అడ్డుకోవడం ఇది సరికాదని ఇటువంటి జీవోను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు.

ఉదయగిరిలో మాట్లాడుతున్న చెంచలబాబు

ఉదయగిరి

స్వేచ్ఛ స్వాతంత్ర్యం లో భిన్నంగా రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన జిఒను ఉపసంహ రించుకోవాలని తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శి మాజీ జెడ్పి చైర్మన్ చెంచలబాబు యాదవ్ విమర్శిం చారు. గురువారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో టిడిపి జాతీయ అధ్యక్షులు మాజీ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడుకు వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేకనే ఇలాంటి వాటికి ఈ ప్రభుత్వం పూనుకుంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రశ్నించే ప్రతిపక్షాల గొంతు నొక్కే విధంగా రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 1, బ్రిటిష్ కాలంలో ఉన్న నల్ల చట్టా లను 1861 పోలీస్ యాక్ట్ ను తీసుకొచ్చి ర్యాలీలు బహిరంగ సభలను నిషేధించడం దుర్మార్గమైన చర్య అని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈనెల 26న చేపట్టే నారా లోకేష్ యాత్రను ఆపేదేది లేదన్నారు.

మాలెపాటి హౌస్ అరెస్ట్

కావలి

జగన్మోహన్‌రెడ్డి రాత్రికి రాత్రే తెచ్చిన చీకటి జిఒ.నెం.1కు వ్యతిరేకంగా గురువారం కావలి ట్రంక్ రోడ్డులోని అంబేద్కర్ విగ్రహం ఎదుట జిఒ.కాపీలను దగ్ధం చేసి, నిరసన కార్యక్రమం నిర్వహిస్తామన్న టిడిపి కార్యక్రమాన్ని కావలి డిఎస్‌పి వెంకటరమణ ఆధ్వర్యంలో భారీ బందోబస్తుతో టిడిపి కావలి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ మాలెపాటి సుబ్బానాయుడును, అతని అనుచరులను ఇంటివద్దనే హౌస్ అరెస్ట్ చేశారు. నాటకీయపరిణామాల వరపరలో పోలీసులు చివరికి టిడిపి నిరసన కార్యక్ర మాన్ని భగ్నం చేశారు. ఈసందర్భంగా టిడిపి నాయకులకు, పోలీ సులకు పెద్దఎత్తున వాగ్వాదం నడిచింది. ఒకదశలో టిడిపి నాయకులు రెచ్చిపోయి, పోలీసులను బయటకు నెట్టి, ప్రభుత్వ జీవో కాపీలను బయటకు తెచ్చి పోలీసులు చూస్తుండగా అగ్గిపుల్ల గీసి తగులబెట్టే ఒదుకు ప్రయత్నించారు. పోలీసులు అందుకు ఒప్పుకోకపోగా, చివరకు జీవో కాపీలను వారెయందే చించి ము క్కలు చేసివేశారు. డిఎస్‌పి వెంకటరమణ మాట్లాడుతూ "ఏదైనా కార్యక్రమం చేయాలంటే ముందు స్వగా పోలీసు పర్మిషన్ తీసుకోవా లన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మలిశెట్టి వెంకటేశ్వర్లు, మొగిలి కల్లయ్య,పాలిశెట్టి, శానం కృష్ణ,ఆత్మకూరి నాగరాజు, గుండ్లపలి శివాజి, అన్నపూర్ణశ్రీను, తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

అందుబాటులో లేని యూరియా

ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు నియోజకవర్గంలో రైతులకు అవసరమైన మేరకు యూరియా సరఫరా జరగడం లేదు. పేరు గొప్ప..ఊరు దిబ్బ.. అన్న చందంగా, రైతుల సంక్షేమం కోసమే రైతు భరోసా కేంద్రాల ఏర్పాటు., రైతుల ముంగిటికే ఎరువులు అని ఆర్భాటంగా ప్రకటించిన ప్రభుత్వం ఆచరణలో మాత్రం ఆమడ దూరంలో నిలిచింది. గత పక్షం రోజులుగా యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారు.రైతు భరోసా కేంద్రాల్లో యూరియా లేకపోవడంతో గ్రామీణ ప్రాంత రైతులు ఆత్మకూరు పట్టణానికి పరుగులు తీయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. పట్టణంలోని సిండికేట్ ఫార్మర్స్ కోఆపరేటివ్ సొసైటీ, గ్రోమోర్ కేంద్రాల వద్ద రైతులు యూరియా కోసం పడిగాపులు కాస్తున్నారు. బయట మార్కెట్లో బస్తాకు సుమారు 100 రూపాయలు అదనంగా చెల్లించి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇకనైనా అధికారులు స్పందించి రైతు భరోసా కేంద్రాల్లో అన్ని రకాల ఎరువులు రైతులకు అందుబాటులో ఉంచాలని ఆత్మకూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జ్ శ్రీధర్ పేర్కొన్నారు. పవనన్న ప్రజాబాట కార్యక్రమంలో భాగంగా ఈరోజు ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని చావడి సెంటర్, సత్రం సెంటర్, చాకలి వీధి, మంగలి వీధి ప్రాంతాలలో పర్యటించి ప్రతి ఇంటికి జనసేన పార్టీ కరపత్రాలను పంచుతూ, జనసేన పార్టీ సిద్ధాంతాలను తెలియజేస్తూ పవనన్న ప్రజాబాట సాగుతుంది. ఈ ప్రాంత ప్రజల ఇబ్బందులను తెలుసుకొని జనసేన పార్టీ తరపున తన వంతు కషి చేస్తానని ఈ సందర్భంగా ఆత్మకూరు నియోజకవర్గ ఇన్చార్జ్ నలిశెట్టి శ్రీధర్ భరోసా ఇచ్చారు.కార్యక్రమంలో ఆత్మకూరు జనసేన పార్టీ నాయకులు వంశీ, చంద్ర, నాగరాజు, ఆనంద్, భాను, ప్రవీణ్, రమేష్, అజయ్, హాజరత్, తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల క్యాలెండర్లు ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఉదయగిరి

:నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ ఉదయగిరి తాలూకా యూనిట్ అధ్యక్షులు బొమ్మత టు శ్రీహరి ఆధ్వర్యంలో గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ సానా శ్రీనివాసులు రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సెలవు దినాలతో ఏపీఎన్జీవో ఉదయగిరి తాలూకా యూనిట్ ఆధ్వర్యంలో నూతన క్యాలెండర్ ఆవిష్కరించడం సంతోషకరంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం ఉదయగిరి తాలూకా యూనిట్ అధ్యక్షులు బొమ్మతట్టు శ్రీహరి, ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, సీనియర్ పాత్రికేయులు పెనుబర్తి మల్లికార్జున, ఎన్జీవో సభ్యులు ఇలియాజ్, భోగ్యం శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు

కావలి

బలిజ ఉద్యోగుల అభ్యుదయ సేవా సమితి (బీస్)నూతన క్యాలెండర్ ఆవిష్కరణ పట్టణంలోని గుండెమడకల దేవదానం ఆస్పత్రిలో బలిజ ఎంప్లాయీస్ అభ్యుదయ సేవా సమితి (బీస్) అధ్యక్షులు తోట. వెంకటేశ్వర్లు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. సభ్యుల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో కావలి పట్టణ ప్రముఖ వైద్యులు, మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టర్. ఎన్. ప్రభాకర్ నాయుడు ముఖ్యఅతిథిగా విచ్చేసి 'బీస్' నూతన క్యాలెండర్-2023 ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్. ఎన్. ప్రభాకర్ నాయుడుని 'బీస్ ' కార్య నిర్వాహకులు సభ్యులు ఘనంగాసత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్. ఎన్.ప్రభాకర్ నాయుడు మాట్లాడుతూ బలిజ ఉద్యోగులందరూ ఒకే వేదికగా ఏర్పడి, కులాలకు అతీతంగా ప్రత్యేకంగా బడుగు బలహీన వర్గాల ప్రజలకుసేవచేయడం, ముఖ్యంగా కోవిడ్-19విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు అనేక సేవలు అందించడం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో 'బీస్ ' గౌరవాధ్యక్షులు నాగిశెట్టి. శ్రీనివాసరావు, అధ్యక్షులు తోట. వెంకటేశ్వర్లు, కార్యదర్శి నాగిశెట్టి. వెంకట సతీష్, ఆదిమూర్తి, కత్తి. శ్రీనివాసులు, హజరత్తయ్య పాల్గొన్నారు.

షటిల్ టోర్నమెంట్ నిర్వహణ

ప్రజాశక్తి-సీతారామపురం

సీతారామపురంలోని వాసవి కన్యకా పరమేశ్వరి దేవి షటిల్ బ్యాడ్మింటన్, టోర్నమెంట్‌ను ఈనెల 12వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల జట్టు సభ్యులు ఈనెల 11వ తేదీ లోపు రూ. 500 ఎంతో ఫీజు తో సంప్రదించాలని, మొదటి బహుమతిగా 10,000, రెండవ బహుమతిగా 6000, మూడవ బహుమతిగా 3000 రూపాయలు, నాలుగో బహుమతిగా 2000 రూపాయలను సొల్లేటి షాపింగ్ మాల్ కు చెందినవారు అందజేస్తారన్నారు. పలు నిబంధనలు వర్తిస్తాయన్నారు.

చెరువు కలుజుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి

ప్రజాశక్తి-కోవూరు

కోవూరుచెరువు కలుజుపై బ్రిడ్జి నిర్మాణం ప్రజల దశాబ్దాల కల, నెరవేర్చుటకు చేస్తున్న పోరాటం రాజకీయాలకతీతంగా అభినదనలు అని టిడిపి నాయకులు చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి అన్నారు. వర్షాకాలం మొదలు ప్రమాదాలు రహదారిగా ప్రయాణానికి ఇబ్బందిగా ఉంది. అనేకమందికి ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాలు నివారించాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉంది. గతంలో బ్రిడ్జి ప్రయత్నానికి గతంలో ఇప్పుడున్న స్థానిక ఎమ్మెల్యే కషి జరిగింది. ఇప్పుడైనా స్థానిక ఎమ్మెల్యే ప్రసన్న కుమార్ రెడ్డి అటువంటి చొరవచూపి ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లి ప్రజల ఆకాంక్షను నెరవేర్చాలని కోరారు. ఈ రహదారి ద్వారా నెల్లూరు సిటీ, కోవూరు పట్టణాల్లో షాపుల్లోకి, పనికి వెళ్లే పేదలు

మాట్లాడుతున్న టిడిపి నాయకులు చేజర్ల

ఇబ్బందులు గురవుతున్నారు. రోజువారి ఆకుకూర వ్యాపారస్తులు, రైతులు, ఆటో కార్మికులు, మూడు నెలలు వర్షాకాలంలో ఇబ్బందులు పడుతున్నారు. కార్యక్రమంలో ఎస్‌కె బాబు, గండవరపు శేషయ్య, వవ్వేటి మల్లికార్జునరెడ్డి, సోమ గోపాల్, హరి, వెంకటేశ్వర్లు, శివ, హరిబాబు, గాదిరాజు సుధయ్య, రమేష్, చాన్ భాషా, పెద్దబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి-కావలి

2018 లో ఏర్పడి ,కావలిలో పలు కార్యక్రమాలను తన ఆశయాల ప్రకారం చేస్తున్న ఎల్డర్స్ క్లబ్ గురువారం కావలి వాయునందన ప్రెస్ వీధిలోని క్లబ్ కార్యాలయమైన శ్రీనివాస కల్యాణమండపంలో 2023 కొత్త సంవత్సరంలో తొలి సమావేశం నిర్వహించింది. కొత్త కమిటీని ఏర్పాటు చేసుకోవడం జరిగింది.

ఎట్టకేలకు పింఛను అందజేత

ప్రజాశక్తి-అనంతసాగరం

మండలం కేంద్రంలో భిక్షాటన చేసుకుంటూ ఉన్న వద్ధుడు, కుష్ఠు వ్యాధిగ్రస్తుడు మకిలి వేంకటేశ్వర్లు. ఎన్నో ఏళ్ల నుంచి అర్హతున్నా అధికారులు, నాయకులు పట్టించుకోలేదు. దీంతో సిపిఎం నాయకులు అర్హతున్న వ్యక్తికి పింఛన్ ఎందుకివ్వరని అధికారులను నిలదీశారు. దీంతో అధికారులు ఎట్టకేలకు వృద్ధుడికి పింఛన్ అందజేశారు. ఈసందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి అన్వర్‌బాషా మాట్లాడుతూ వృద్ధుడికి పింఛన్ అందజేసేందుకు సహకరించిన అధికారికి ధన్యవాదాలు తెలిపారు.

ఆర్థిక చేయూత

ప్రజాశక్తి-అల్లూరు

మండలం లోని చెలిక సంఘం గ్రామంలో ప్రమాదంలో మతి చెందిన ముగ్గురు బాధితులకు గురువారం ఐటిడిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ రాణి మందా 5వేల రూపాయల ఆర్థిక సాయం అందించారు. గతేడాది నవంబర్ 28న భవాని మాల వేసుకుని కోవూరులో భజనకు వెళ్లి తిరుగు ప్రయాణం దగదర్తి మండలం సున్నపుబట్టి వద్ద లారీ ఢీకొని మతి చెందిన చేవూరు వరదయ్య, యాటగిరి నారాయణమ్మ, ఈగ కామేశ్వరమ్మ అలాగే తీవ్ర గాయాల పాలైన ఈగ మధుసూదన్ కు ఒక నెలకు సరిపడా నిత్యావసర సరుకులను అందజేశారు.

బ్రెయిన్ స్ట్రోక్‌తో వలంటరీ మృతి

ప్రజాశక్తి-కోవూరు

బ్రెయిన్ స్ట్రోక్‌తో వలంటీరు గురువారం మృతిచెందింది. స్థానికుల సమాచారం మేరకు.. ఈసంఘటన మండలంలోని పడుగు పాడు గ్రామం చంద్రమౌళి నగర్ గిరిజన కాలనీలో బుధవారం రాత్రి చోటు చేసు కుంది..చంద్రమౌళి నగర్ కాలనీలో కొమరగిరి అఖిల (25) వలంటీర్ చక్కగా బాధ్యతలు నెరవేరుస్తుంది. పింఛన్లు, ఇళ్ల స్థలాలు, సర్వేలు ఇలా ఒక్కటేమిటి అక్కడి ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు చాలా చక్కగా అందించేది. కేవలం ప్రభుత్వం ఇచ్చే ఐదు వేల జీతంతో ఎనలేని సేవలు అందిస్తుండేది. అక్కడ వద్దులకు ఈమె మరో కుమార్తె లాగా శభాష్ అనిపించుకొని మంచి పేరు తెచ్చుకుంది. తన భర్త కొమరగిరి శేషాద్రి తెచ్చే కూలి డబ్బులు తో ఇంటిని చక్కగా నిర్వర్తించేది.బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో మృతిచెందింది. మృతురాలి కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానిక గిరిజనులు వేడుకుంటున్నారు.

జిఒ ప్రతులను కాల్చుతున్న దృశ్యం

'ఎంఎల్ఎ ప్రసన్న అవినీతి పరుడు'

ప్రజాశక్తి-కొడవలూరు

అవినీతి, అక్రమాల్లో ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి కోవూరు నియోజకవర్గంలో జీవో నెంబర్ వన్‌గా ఉన్నారని టిడిపి మండల అధ్యక్షుడు కోటంరెడ్డి అమరేంద్ర రెడ్డి ఆరోపించారు. ఆయన గ్రావెల్, ఇసుక మాఫియా నాయకులకు అండగా ఉంటూ కమీషన్ తీసుకుంటున్నారని పేర్కొన్నారు. మండలంలోని నార్త్ రాజుపాలెం పిఎస్‌ఆర్ కళ్యాణమండపంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డిపై పలు విమర్శలు చేశారు. చంద్రబాబు నాయుడు పర్యటనకు 40 వేల నుంచి 50 వేల వరకు జనం వచ్చారన్నారు. కోవూరు నియోజక వర్గంలో ఇంతవరకు అంత జనాన్ని చూడలేదన్నారు. గతంలో ఎన్టీ రామారావు పర్యటించినప్పుడు కూడా ఇంత జనాభా వచ్చారో లేదో తెలియదు కానీ చంద్రబాబుకు జనం స్వచ్ఛందంగా వచ్చారన్నారు. నల్లపరెడ్డి శ్రీనివాసరెడ్డి చనిపోయేటప్పుడు కాంగ్రెస్ పార్టీలో ఉన్నారు. టిడిపిలో ప్రసన్న కుమార్ రెడ్డికి టికెట్టు ఇవ్వమని చెబితే మళ్లీ 1999లో వచ్చి చంద్రబాబు నాయుడు కాళ్ళు పట్టుకొని 99లో గెలిచావు అని అన్నారు. చంద్రబాబు పర్యటనలు, లోకేష్ పాదయాత్రను అడ్డుకునేందుకే వైసీపి ప్రభుత్వం జీఓ నెం.1 ను తీసుకొచ్చిందన్నారు. ప్రజా సేవ చేయాలను కునే వారెవరైనా తెలుగుదేశంలోకి వస్తే ఆహ్వానిస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో ఎంపిటిసి గరికపాటి రాజేంద్ర, చక్కా మదన్ మోహన్ రావు, కరకటి మల్లికార్జున, చెముకుల చైతన్య కష్ణ, టిడిపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం నాయకుడి మృతికి నివాళులు

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని అల్లంపాడు గ్రామవాసి సిపిఎం సీనియర్ సభ్యులు షేక్ ఖాసీం (80)గు రువారం తెల్లవారుజామున మతి చెందారు.ఆయన భౌతిక కాయానికి ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలి వెంగయ్య మండల కార్యదర్శి రహంతుల్లా, ఐద్వా మండల కార్యదర్శి శ్యామలమ్మ, సిఐటియు మండల కార్యదర్శి రత్నయ్య, సూర్య నారాయణ, ఖాజావలి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. 40ఏళ్లుగా పార్టీ కార్యక్రమాల్లో పాల్గొని పార్టీ బలోపేతానికి కషి చేశారు.పార్టీ చేపట్టిన అనేక ప్రజా ఉద్యమాలలో చురుకైన పాత్ర నిర్వహించారన్నారు.ఆయన మతి పార్టీకి తీరని లోటన్నారు.

హెల్మెట్, లైసెన్స్ తప్పనిసరి

ప్రజాశక్తి-వరికుంటపాడు

జాతీయ రహదారి లో పోలీస్ స్టేషన్ ఎదురుగా ఎస్ఐ బాల మహేందర్ నాయక్ వాహనాల తనిఖీలు చేపట్టారు. తనిఖీలో భాగంగా హెల్మెట్, లైసెన్స్ లేని వాహనదారులకు జరిమానాలు విధించారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్, లైసెన్స్ కలిగి ఉండి, మద్యం సేవించి అధిక వేగంతో వాహనాలు నడపకుండా ఉండాలని వాహనదారులకు ఎస్ఐ సూచించారు. తనిఖీల్లో సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ నారాయణ, కిన్నెర ప్రసాద్, వెంకటసుబ్బయ్య తదితరులున్నారు.

అభివృద్ధికి సహకరించండి

ప్రజాశక్తి-సీతారామపురం

పంచాయతీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని మారం రెడ్డి పల్లి సర్పంచ్ గాజుల వీర భారతి చంద్రారెడ్డి పేర్కొన్నారు. గురువారం సచివాలయంలో పంచాయతీ పాలకవర్గం, సచివాలయ సిబ్బంది, అంగన్వాడీలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీలో తాగునీరు, పారిశుధ్యం, వీధిలైట్ల సమస్య లేకుండా చూడాలని, పన్నులను సకాలంలో వసూలు చేసి పంచాయతీ ఆదాయానికి సహకరించ చాలన్నారు. కార్యక్రమంలో స్థానిక నేత గాజులపల్లి చంద్రారెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఖాదర్ బాషా, సచివాలయం సిబ్బంది వాలంటీర్లు పాల్గొన్నారు.

సభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-కలిగిరి

స్థానిక ఆర్‌అండ్‌బి గెస్ట్ హౌస్‌లో ఉదయగిరి ఎంఆర్‌పిఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం కాశాస్ మాదిగ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంఆర్‌పిఎస్ జిల్లా ఇన్‌ఛార్జ్ గొల్లపల్లి శ్రీనివాస్ మాదిగ పాల్గొని ఆయన మాట్లాడారు. జనవరి 11న బెంగళూరులో జరుగు ఎం ఎస్ పి ఎమ్మార్పిఎస్, అనుబంధ సంఘాల జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు.

తక్షణ సాయం అందజేత

ప్రజాశక్తి-సీతారామపురం

: మండలంలోని నాగరాజు పల్లి గ్రామానికి చెందిన దుద్దేల తిరుపతమ్మ(43) బుధవారం జ్వరానికి గురై చికిత్స పొందుతూ మృతిచెందింది.అందుకు గాను అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం మతురాలి భర్త గురవయ్యకి పదివేల రూపాయలను సర్పంచ్ పొట్టి శ్రీలక్ష్మి అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హత గల ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేందుకు కషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి డి. ప్రేమ్ కుమార్, వెల్ఫేర్ అసిస్టెంట్ ఎన్. పాండు, వాలంటీర్ వీర ప్రసాద్ పాల్గొన్నారు.

7న నాటక ప్రదర్శన

ప్రజాశక్తి-కావలి

ఈనెల 7వ తేదీ శనివారం సాయంత్రం ఏడు గంటలకు కావలిలో కారొనేషన్ రీడింగ్ రూమ్ (రైల్వే రోడ్డు) ఆవరణలో బాలసుబ్రమణ్యం ఆర్ట్స్ అండ్ మ్యూజిక్ అకాడమీ (బామా)వారి ఆధ్వర్యంలో సురభి నాటక కళాకారులు ప్రదర్శించబోయే "ఘంటసాల నాటకం ప్రదర్శించబడును. నాటకాన్ని తిలకించి అలరించాల్సిందిగా నాటకం రచయిత భాస్కరుని సత్య జగదీశ్ ఒక ప్రకటనలో పిలుపు నిచ్చారు.అయన మీడియాతో మాట్లాడుతూ అమర గాయకులు, గానగంధర్వులు, సంగీత దర్శకులు, ఘంటసాల వెంకటేశ్వరరావు శతజయంతి ఉత్సవాల సందర్భంగా, శ్రీ సాయి సంతోషి నాట్యమండలి సురభి కళాకారుల సహాయార్థం సాహిత్యప్రక్రియలో అత్యున్నత స్థానం సంపా దించుకున్న నాటకాన్ని బతికించుకోవడం కోసం బీ ఘంటసాల నాటకాన్ని ప్రదర్శించబడునని తెలిపారు.

రక్తదానం గొప్పది

ప్రజాశక్తి-కొడవలూరు

మండలంలోని నార్త్ రాజుపాలెం శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో శ్రీపతి రాము ఆధ్వర్యంలో నెల్లూరు నగరంలోని ధనలక్ష్మిపురంలో 24 యూనిట్ల రక్తాన్ని డొనేట్ చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ పి.కుమార్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా విద్యా ఫౌండేషన్ సభ్యులు కళాశాల చైర్మన్ డాక్టర్ పెనుబల్లి బాబు నాయుడు, డైరెక్టర్ పెనుబల్లి కష్ణ చైతన్య ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రక్తదాన శిబిరంలో ఎన్ఎస్ఎస్ సిడిఇ సెల్ కోఆర్డినేటర్లు డాక్టర్ టి.సుబ్రహ్మణ్యం, ఎన్ నర్మద, వీరితో పాటు అధ్యాపక సిబ్బంది,ఎస్. నాగేంద్రబాబు, డి.రమణ, సూపర్‌వైజర్ ఎం నిరంజన్, విద్యార్థులు పాల్గొన్నారు.

CHANGE OF SURNAME

I, CHITTUMURU VARA LAKSHMI (Old Name) wife of CHITTAMURU VENKATA SUBBA REDDY,Resident of H.No.3-35,Near Vishnalayam, MUNGAMURU Village, Bogole Mandal, SPSR Nellore Dt.is hereby declared that I have changed my surname as

CHITTAMURU VARA LAKSHMI

(New Name)

hereafter call all purpose in future.

In The Court of the Family Judge : Nellore

F.C.O.P.No. 163 / 2021

Kandula Naresh - Petitioner

Vs

Kandula Pavani - Respondent

Notice to Respondent

Kandula Pavani, W/o **Naresh,** Residing at Plot No. 3353, YSR Nagar, Kothur, Nellore City.

పై నెంబరు కేసులో పిటిషనరు మీమీద విడాకులు కోరుచూ F.C.O.P.No. 163 / 2021 పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్‌లో మీకు నోటీసు నిమిత్తం **తే19-1-2023**దిన వాయిదా ఉన్నది. ఆరోజు **ఉదయం 10.30 గంటలకు** మీరు స్వయంగా గానీ వకీలు ద్వారా గానీ హాజరై మీ అక్షేపణలు తెలుపుకొనవలసింది లేనియెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

దార రమణమ్మ, బి.ఎస్‌సి., ఎల్.ఎల్.బి.,
న్యాయవాది, నెల్లూరు.
సెల్: **93935 35870**